క్లుప్తంగా

విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచండి



విద్యార్థులతో చదివిస్తున్న ఉద్ధవ్

కెరమెరి: విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు పెంచాలని ఐటీడీఏ జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి(ఏసీఎంవో) పుర్క ఉద్ధవ్ అన్నారు. మండలంలోని అనార్‌పల్లి ఆశ్రమ ఉన్నత, చింతపల్లి, కొలాంగూడ(డి), జైరాంగూడ, అంద్‌గూడ ప్రాథమిక పాఠశాలలను గురువారం సందర్శించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో తెలుగు, ఆంగ్ల పదాలను బోర్డుపై రాయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చదువుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రికార్డులు సరైన విధంగా నమోదు చేయాలన్నారు. టెన్త్ విద్యార్థులకు వంద రోజుల ప్రణాళిక అమలు చేయాలన్నారు. అనార్‌పల్లి పాఠశాల హెచ్‌ఎం బలిరాం, డిప్యూటీ వార్డెన్ వసంత్‌రావు, ఎస్సీఆర్పీ నరేశ్, హెచ్‌ఎంలు ఉన్నారు.

క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలి

వాంకిడి: క్రీడాకారులు ఆటల్లో క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని జెడ్పీటీసీ అజయ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా పోటీలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. భగత్‌సింగ్ స్ఫూర్తితో యువత ఆయన ఆశయాలు కొనసాగించాలన్నారు.కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుర్నులె నారాయణ, డీవైఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గొడిసెల కార్తీక్, జిల్లా అధ్యక్షుడు టికానంద్, ఉపాధ్యక్షుడు చాపిడి పురుషోత్తం, నాయకులు సతీశ్, దుర్గం రాజ్‌కుమార్, దుర్గం నిఖిల్, వడ్లూరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పరిశీలన



పరిశీలిస్తున్న ఎంపీటీసీ ప్రవీణ్‌కుమార్

వాంకిడి: మండలంలోని ఖమాన రహదారిపై నూతనంగా నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను ఎంపీటీసీ ప్రవీణ్‌కుమార్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మాణంలో నాణ్యతప్రమాణాలు పాటించాలన్నారు. నాసిరకం పనులు చేపడితే ఉపేక్షించబోమని కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు.

ఇళ్లస్థలాలకు పట్టాలివ్వాలి

కౌటాల: మండలంలోని పీపీనగర్ గ్రామంలో నివసిస్తున్న వారికి ఇంటి స్థలాలకు పట్టాలివ్వాలని కోరుతూ గ్రామస్తులు తహసీల్దార్ పుష్పలతకు గురువారం వినతిపత్రం అందజేశారు. 2001లో గ్రామంలో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నామని, తాము ఉన్న ఇంటి స్థలాలకు పట్టా మంజూరు చేయాలని కోరారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు నివేదిస్తానని తహసీల్దార్ పేర్కొన్నారు.

శిశుమందిర్‌లో ప్రీప్రైమరీ వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న చిన్నారులు

ఆసిఫాబాద్: జిల్లాకేంద్రంలోని సరస్వతీ శిశు మందిర్‌లో ప్రీప్రైమరీ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్యాలు పలువురిని అలరించాయి. విభాగ్ శైక్షణిక్ ప్రముఖ్ పూదరి సత్యనారాయణ, పోషకుడు శ్రీనివాస్, పాఠశాల ప్రతినిదులు సత్యనారాయణ, శ్రీనివాస్, మధుకర్, జంజిరాల శ్రీనివాస్, సంతోశ్, ఖాండ్రే విశాల్, ఉమ, రమాదేవి, వైష్ణవి, అఖిల, దుర్గ, హరిప్రియ పాల్గొన్నారు.

టీయూటీఎఫ్ కార్యవర్గం

ఆసిఫాబాద్‌రూరల్: టీయూటీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి సదాశివ్ తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా ధన్‌రాజ్, అధ్యక్షుడిగా మధుకర్, సహధ్యక్షులుగా మహేశ్, విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శిగా ప్రకాశ్, సంయుక్త కార్యదర్శులుగా తిరుపతి, వకీల్, కార్యదర్శులుగా కృష్ణమూర్తి, గణేశ్, విశ్వనాథ్, రాజేందర్, కన్వీనర్లుగా తిరుపతి, ప్రశాంత్, సభ్యులుగా హనుమంతు, రాజయ్య, వినయ్ కుమార్, సుభాష్, సతీశ్ ఎన్నికయ్యారు.

ముస్తాబైన ఆలయాలు

- నేడు మహాశివరాత్రి
- శివ పార్వతుల కల్యాణానికి తరలిరానున్న భక్తులు
- ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి



కెరమెరి: విద్యుత్ దీపాలతో శివాలయం



కౌటాల: సదాశివపేట శివాలయం



కాగజ్‌నగర్‌రూరల్: ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి జెడ్పీచైర్మన్ కృష్ణారావు

ఆసిఫాబాద్‌అర్బన్: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా ఆలయాలు ముస్తాబయ్యాయి. జిల్లాకేంద్రంలోని సందీప్‌నగర్ శివాలయంతోపాటు పలు క్షేత్రాల్లో భక్తులకు ఇబ్బంది లేకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. సందీప్‌నగర్ శివాలయంలో కల్యాణానికి సాయంత్రం 4 గంటలకు శివకేశవ మందిరం నుంచి ఉత్సవ విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహిస్తారు. అనంతరం ఆలయ ఆవరణలో శివపార్వతుల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. కల్యాణ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనేలా సోషల్‌మీడియా, కరపత్రాల ద్వారా విస్తృత ప్రచారాన్ని చేపట్టారు. శివరాత్రి జాతరకు వెళ్లే భక్తులకు ఆర్టీసీ యాజమాన్యం బస్సులు ఏర్పాటు చేసింది.

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని శివాలయాల్లో శివ పార్వతుల కల్యాణానికి ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. బూర్గుడలోని శివ పంచాయతన ఆలయం, గుండిలో శివాలయం, చిర్రకుంటలోని శివ పార్వతుల ఆలయంలో కల్యాణంతోపాటు జాతర జరగనుంది.

నేడు ప్రత్యేక పూజలు..

బూర్గుడ, గుండి, చిర్రకుంట, సందీప్‌నగర్ శివాలయాల్లో శివ పార్వతుల కల్యాణం, సాయంత్ర రథోత్సవం, జాతరకు మోతుగూడ, ఇదులవాడ, రాజుర, పర్సనంబాల, చిలాటిగూడ గ్రామాల భక్తులు తరలిరానున్నారు. ప్రత్యేక పూజలు అనంతరం మొక్కు చెల్లించనున్నారు.

దహెగాం: లగ్గాం గ్రామంలో జాతర నిర్వహించనున్నారు. ఉమాచంద్రశేఖర ఆలయం విద్యుత్ దీపాలతో అలంకరించారు. శివాలయాలు ముస్తాబు చేశారు. మరుసటి రోజు బోనాల పండుగ, అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు.

కెరమెరి: మండల కేంద్రంలోని శివాలయం ముస్తాబైంది. నెహ్రూనగర్‌లో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం విద్యుద్దీపాలతో ముస్తాబైంది. ఉదయం 11 గంటలకు వేంకటేశ్వరస్వామి వారి పల్లకీ ఊరేగింపు వీధుల గుండా నిర్వహించనున్నారు.

కౌటాల: కౌటాలలోని సదాశివపేట శివాలయం విద్యుత్ దీపాలతో అలంకరించారు. సాయంత్రం పార్వతీ పరమేశ్వరుల కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు అర్చకుడు శంకరయ్య తెలిపారు.

బెజ్జూర్: మండల కేంద్రంలోని శ్రీ రంగనాయక స్వామి ఆలయం ముస్తాబైంది. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కాగజ్‌నగర్‌రూరల్: ఈజ్‌గాం శివాలయంలో జరిగే జాతర ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లు, తాగునీరు, టాయిలెట్లు, హెల్త్‌క్యాంపు ఏర్పాటు చేశారు. సాయంత్రం 5.15 గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ఎమ్మెల్యే హరీశ్‌బాబు దంపతులతో నిర్వహించనున్నారు. జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఈవో వేణుగోపాల్, జాతర ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మురళీధర్‌రావు ఏర్పాట్లు చేశారు.

ఏర్పాట్లు పరిశీలన

ఈజ్‌గాం శివాలయంలో జాతర ఏర్పాట్లను ఇన్‌చార్జి జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు గురువారం పరిశీలించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈజ్‌గాం శివాలయానికి వెళ్లే భక్తులకు ఇబ్బంది కలుగకుండా మున్సిపల్ చైర్‌పర్సన్ షాహీన్‌సుల్తానా ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. చెక్‌పోస్టు నుంచి కాపువాడలోని మసాలా ఒర్రె వరకు రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన మట్టిని తొలగించారు. గుంతలు పూడ్చివేశారు. కౌన్సిలర్లు జయచందర్, సంగీతకిశోర్, శివప్రసాద్, విజయ్‌యాదవ్, రేఖాశ్రీనివాస్, నాయకులు దస్తగీర్ తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): మండలకేంద్రంలోని శ్రీబాలాజీ వేంకటేశ్వర, శివాలయాలు విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ తెలిపారు.

ఘనంగా మహిళా దినోత్సవం



కౌటాల: ఆరోగ్య కేంద్రంలో..



ఆసిఫాబాద్‌రూరల్: సన్మానిస్తున్న నాయకులు



కెరమెరి: కేక్ కట్ చేస్తున్న మహిళా టీచర్లు

రెబ్బెన: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని ఎంపీపీ సౌందర్య అన్నారు. మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ మహిళా నాయకురాలు మస్కం పద్మ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. అనంతరం మహిళలు కేక్ కట్ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ విద్యతోనే మహిళల్లో అభివృద్ధి సాధ్యమన్నారు. విద్యకు ప్రథమ స్థానం ఇవ్వాలని అన్నారు. మాజీ సర్పంచ్ అహల్యాదేవి, బీఆర్‌ఎస్ మహిళా మండల అధ్యక్షురాలు అన్నపూర్ణ అరుణ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ అధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయినులను సన్మానించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఇందురావు, ఉపాధ్యక్షుడు హేమంత్, కోశాధికారి రమేశ్, ఉశన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కౌటాల: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని టీజీబీ రీజనల్ మేనేజర్ మురళీ మనోహర్ రావు అన్నారు. టీజీబీ ఆధ్వర్యంలో స్థానిక బ్యాంకులో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల ఆర్థిక అభివృద్ధికి శ్రమిస్తున్న 16 మంది మహిళలను సన్మానించారు. అలాగే స్థానిక పీహెచ్‌సీ, ఐకేపీ కార్యాలయాల్లో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఏపీఎం ముక్తేశ్వర్, బ్యాంకు మేనేజర్లు నరసింహ స్వామి, కిరణ్, వైద్యురాలు నవత పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం, భారతీయ యువశక్తి ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం మహిళా దినోత్సవ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనరసింహం, భారతీయ యువశక్తి ట్రస్ట్ ప్రతినిధి కునాల్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రాజు, అధ్యాపకులు, మహిళా సాధికారిత విభాగం ఇన్‌చార్జి కృష్ణవేణి, అధ్యాపకులు శారద, రోజ్‌మేరీ, శాంభవి, కవిత,ఎం.రాజేశ్వర్, దేవేందర్, వెంకటేశం, ట్రస్ట్ ప్రతినిధి శంకర్ పాల్గొన్నారు.

- పీఆర్టీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని పద్మశాలి భవన్‌లో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ షాహీనాసుల్తానా మాట్లాడుతూ బాలిక విద్యను ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం పదోన్నతి పొందిన మహిళా ప్రధానోపాధ్యాయులు, గురుకులాల్లో ఉద్యోగాలు సాధించిన ఉద్యోగులను సన్మానించారు. సీడీపీవో సురేఖ,పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శులు ప్రకాశ్, మండల అధ్యక్ష, కార్యదర్శులు భిక్షపతి, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

కెరమెరి: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళా టీచర్లను సుగుణ, యశోద, విజయతోపాటు స్వీపర్ గంగమ్మను సన్మానించారు. అనంతరం మహిళా టీచర్లు కేక్ కట్ చేశారు. మహిళల గొప్పతనం, ఔన్నత్యాన్ని కెరమెరి కాంప్లెక్స్ హెచ్‌ఎం చంద్రశేఖర్ చాటి చెప్పారు. ఎంపీడీవో కార్యాలయంలో అంగన్‌వాడీలు, పారిశుద్ధ్య కార్మికులను ఎంపీడీవో క్రిష్టారావు సన్మానించారు.

బీఆర్‌ఎస్ కృషితోనే బీటీరోడ్లు

- ఎమ్మెల్యే కోవలక్ష్మి



కొత్తపులికుంటలో బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్.

రెబ్బెన(ఆసిఫాబాద్): బీఆర్‌ఎస్ కృషితోనే మారుమూల గ్రామాలకు బీటీ రోడ్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే కోవలక్ష్మి, జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. మండలంలోని రాంపూర్, కొత్త పులికుంట, రోళ్లపాడు, పైకాజీగూడ గ్రామాలకు ఐటీడీఏ నిధులతో మంజూరైన బీటీ రోడ్డు పనులకు గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలో గ్రామాల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించామన్నారు. మండలంలోని గ్రామాల ప్రజలు మట్టిరోడ్లతో ఇబ్బందులకు గురవుతుండగా ప్రభుత్వ సహకారంతో ఐటీడీఏ ద్వారా బీటీ రోడ్లు మంజూరు చేయించిన ఘనత బీఆర్‌ఎస్‌దే అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపీపీ సౌందర్య, జెడ్పీటీసీ సంతోష్, పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్‌కుమార్, ఎంపీటీసీలు సంధ్యారాణి, సంఘం శ్రీనివాస్, మాజీ సర్పంచులు సోమశేఖర్, పోషమల్లు, జగన్నాథం, కోఆప్షన్ సభ్యుడు జహూరోద్దీన్, బీఆర్‌ఎస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

రెబ్బెన: ఎంపీడీవో కార్యాలయంలో గురువారం 7 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను జెడ్పీ చైర్‌పర్సన్ కోనేరు కృష్ణారావుతో కలిసి ఎమ్మెల్యే కోవలక్ష్మి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీటీసీలు దుర్గం శ్రీవాణి, సంఘం శ్రీనివాస్, రఘుపతి, పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్‌కుమార్, ఎంపీడీవో శంకరమ్మ పాల్గొన్నారు.

‘ఆదరణ చూసి ఓర్వలేకనే’

రెబ్బెన: ఆదివాసీ నేత అయిన ఎమ్మెల్యే కోవలక్ష్మిని ప్రజల్లో ఉన్న ఆదరణ చూసి ఓర్వలేకే కాంగ్రెస్ నాయకులు అవమానిస్తున్నారని ఆదివాసీ హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్మటి సుధాకర్, ప్రచార కార్యదర్శి కొడిపె వెంకటేశ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల చేత ఎన్నికైన కోవలక్ష్మిని కాంగ్రెస్ అనుచరులు అవమానించడం తగదని తెలిపారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నేతల వాగ్వాదం



వాగ్వాదం చేసుకుంటున్న నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని పలు గ్రామాలకు ఐటీడీఏ నిధులతో మంజూరైన బీటీ రోడ్డు పనులకు నిర్వహించిన భూమిపూజలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. బీఆర్‌ఎస్ హయాంలో రాంపూర్, కొత్తపులికుంట, రోళ్లపాడు, పైకాజీగూడ గ్రామాలకు బీటీ రోడ్లు మంజూరు కాగా టెండర్ల ప్రక్రియ పూర్తయ్యాక పనులు ప్రారంభించే లోపే అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావటంతో పనులు ప్రారంభం కాలేదు. అయితే గురువారం రాంపూర్, కొత్తపులికుంట, రోళ్లపాడు, పైకాజీగూడ గ్రామాల బీటీ పనులకు భూమిపూజ చేసేందుకు ఎమ్మెల్యే కోవలక్ష్మి, జెడ్పీ చైర్మన్ హాజరయ్యారు. రాంపూర్‌లో పనులు ప్రారంభిస్తున్న క్రమంలో ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రొటోకాల్ పాటించలేదని జిల్లా ఇన్‌చార్జి మంత్రికి సమాచారం అందించకుండా బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు అభివృద్ధి పనులకు ఎలా భూమిపూజ చేస్తారని కాంగ్రెస్ నాయకులు అడ్డుపడ్డారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి కాంగ్రెస్ నాయకులను పంపించివేయడంతో సద్దుమణిగింది. ప్రజల చేత ఎన్నుకోబడిన నియోజక వర్గ ఎమ్మెల్యేకు అభివృద్ధి పనులను ప్రారంభించే హక్కు లేదా అని ఎమ్మెల్యే కోవలక్ష్మి అన్నారు.

‘ఇన్‌చార్జి మంత్రిని అవమానించిన అధికారులు’



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

రెబ్బెన: మండలంలో సుమారు రూ. 4.5కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో అధికారులు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను ఆహ్వానించకుండా అవమానించారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లావుడ్య రమేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గం దేవాజీ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. మండలంలోని రాంపూర్, నారాయణపూర్, పులికుంట, రోళ్లపాడు జీపీలకు రూ. 4.5 కోట్ల ఐటీడీఏ నిధులతో బీటీ రోడ్లు మంజూరు కాగా, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ప్రత్యేక చొరవ తీసుకుని రహదారుల నిర్మాణానికి కృషి చేశారని అన్నారు. అలాంటి మంత్రిని కేవలం ఆదివాసీ మహిళ అనే కారణంతోనే ప్రారంభోత్సవానికి సమాచారం ఇవ్వలేదన్నారు. ప్రోటోకాల్ పాటించకుండా అవమానపర్చారని అన్నారు. సుదర్శన్‌గౌడ్, చిరంజీవిగౌడ్, రాజేష్, ఇంరోజ్, అన్నాజీ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు విలువైనది

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



ఈవీఎం ద్వారా ఓటు వేస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఈవీఎం, వీవీప్యాట్‌లను అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ఓటర్లు నిర్భయంగా నిష్పక్షపాతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఓటు వేసే విధానాన్ని వివరించేందుకు ప్రజల కోసం అవగాహన కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. వచ్చిన దరఖాస్తులను కంప్యూటరీకరణ చేయాలన్నారు. ఆరు గ్యారంటీల అమల్లో భాగంగా ప్రజాపాలన ప్రక్రియలో ఏవైనా తప్పులుంటే వాటిని సవరించేందుకు అవకాశం ఉందన్నారు. ఎంపీడీవో శ్రీనివాస్, సంబంధిత అధికారులు, సిబ్బంది ఉన్నారు.

అర్హులందరికీ గృహజ్యోతి

ఆసిఫాబాద్: ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ఆరు గ్యారెంటీల్లో భాగంగా అర్హులందరికీ గృహజ్యోతి పథకం అమలు చేస్తామని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లాకేంద్రంలోని దస్నాపూర్ కాలనీలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ట్రాన్స్‌కో ఎస్‌ఈ వాసుదేవ్‌తో కలిసి ఇంటింటికి గృహజ్యోతి జీరో విద్యుత్ బిల్లులు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాసంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు పథకాల ఫలాలు అందిస్తామన్నారు. గృహజ్యోతి పథకంలో గృహ అవసరాల కోసం నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

దహెగాం: బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో పొత్తు పెట్టుకోవడాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్‌ఎస్ మండల నాయకులు నిరసన తెలిపారు. మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు ప్రసాద్‌రాజు, జెడ్పీటీసీ తాళ్లపల్లి రామారావు ఆధ్వర్యంలో ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు కార్యకర్తలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోనేరు కోనప్ప ఓటమికి కారణమైన ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో బీఆర్‌ఎస్ పొత్తు పెట్టుకోవడం సరికాదన్నారు. భవిష్యత్తులో కోనప్ప తీసుకునే నిర్ణయానికి ఆయన వెంట ఉంటామన్నారు. వైస్ ఎంపీపీ చౌదరి సురేష్, నాయకులు సంతోష్‌గౌడ్, ఎస్కే హైమద్, సంతోష్, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా చేపట్టాలి

నార్నూర్: కుష్ఠు సర్వేను పకడ్బందీగా చేపట్టాలని వైద్యాధికారి రాంబాబు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈనెల 11 నుంచి 24 వరకు సర్వే చేపట్టాలన్నారు. కుష్ఠు వ్యాధి లక్షణాల గురించి గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వివరించి వ్యాధిగ్రస్తులను గుర్తించాలన్నారు. లక్షణాల నిర్ధారణ అనంతరం మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. సమావేశంలో హెచ్‌ఈవో చౌహన్ నాందేవ్, సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్ దాస్, రాజవ్వ, చుక్కమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తరాఖండ్ పాఠశాల సందర్శన



వివరాలు తెలుసుకుంటున్న ఎస్‌వో

ఆసిఫాబాద్‌రూరల్: ఉత్తరాఖండ్‌లోని పాఠశాలను జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్ రూమ్ టు రీడ్ ఇండియా జిల్లా లీడర్ జెన్నిఫర్ రాణితో కూడిన బృందం గురువారం సందర్శించింది. తొలి మెట్టు (ఎఫ్‌ఎల్‌ఎస్) అమలు, అభ్యసన ఫలితాలు, ఉపాధ్యాయులు అవలంబిస్తున్న వినూత్న బోధన పద్ధతులను పరిశీలించారు. అక్కడి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, తదితర అమలు పరిశీలించామని ఎస్‌వో శ్రీనివాస్ తెలిపారు. ఆ రాష్ట్ర సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్‌తో చర్చాగోష్ఠిలో తమ బృందం సభ్యులు హన్మంతు, నితిన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ

కౌటాల: మండలంలోని వీర్దండి సమీపంలోని వార్ధా నది ఒడ్డున గల శ్రీ బీర్య హనుమాన్ పుణ్యక్షేత్రంలో గురువారం వేదపండితులు ప్రత్యేక పూజలతో శివుని విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో మూడు రోజుల పాటు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామాల నుంచి భక్తులు వచ్చి ఆలయంలో పూజలు చేశారు. మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు వాసు పటేల్, ఆలయ కమిటీ అధ్యక్షుడు పర్చాకే బండు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కుర్చీలు అందజేత

కాగజ్‌నగర్‌రూరల్: అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని గెర్రెగూడ గ్రామ ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు కాగజ్‌నగర్ డివిజనల్ మేనేజర్ శ్రావణి గురువారం కుర్చీలు, సీలింగ్ ఫ్యాన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. హెచ్‌ఎం దొంగ్రె సంతోశ్, ప్లాంటేషన్ డిప్యూటీ మేనేజర్ దుర్గం రాకేశ్, ప్లాంటేషన్ వాచర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రం తనిఖీ

కెరమెరి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని స్టేట్ అబ్జర్వర్లు గురువారం తనిఖీ చేశారు. విద్యార్థులు పరీక్షలు రాస్తున్న తీరును పరిశీలించారు. మాస్‌కాపీయింగ్‌కు తావు లేకుండా సజావుగా పరీక్షలు నిర్వహించాలన్నారు. సీఎస్ పరుశురాములు, డీవో సునీల్‌కుమార్ ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిర్పూర్(టి): కుమురంభీం జిల్లాలోని గురుకులాల్లో 6, 7, 8, 9 తరగతుల్లో 2024–25 విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకులాల సంస్థ జిల్లా కోఆర్డినేటర్ బాలరాజు తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈనెల 4 నుంచి 23 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

నేడు కంకలమ్మ ఆలయంలో పూజలు

కౌటాల: మండల కేంద్రానికి సమీపంలోని గుట్టపై గల కంకలమ్మ దేవాలయంలో శుక్రవారం మహాశివరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సుల్వ కనకయ్య తెలిపారు. ఉదయం 9. 15 గంటలకు పల్లకీ సేవ, 11.15 గంటలకు మహా రుద్రయాగం, రాత్రి 12 గంటలకు సహస్ర బిల్వార్చన కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.